క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం


అంతర్వేదిలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేద మంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన అర్చకుడు పి.రామశేషాచార్యులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదానంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేసింది. దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


మొక్క నాటుతున్న సర్పంచ్ తాతకాపు

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పిలుపునిచ్చారు. వనం–మనం కార్యక్రమంలో భాగంగా లూటుకుర్రు గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు 175 మామిడి మొక్కలను ఉద్యానశాఖ సమకూర్చింది. వాటిని సర్పంచ్ శుక్రవారం రైతుల పొలాల్లో పాతారు. ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా జెడ్పీ మాజీ చైర్మన్ రాంబాబు మగటపల్లిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన

మలికిపురం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మలికిపురంలో శుక్రవారం ఆందోళన జరిగింది. రాజ్యాంగాన్ని విస్మరించి ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెల్లదంటూ మాల సంఘాల ప్రతినిధులు నినాదాలు చేశారు. ఈ మేరకు మాలల న్యాయ పోరాట సమితి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మలికిపురం మండల జేఏసీ కన్వీనర్ తోటే రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక పూలే అంబేడ్కర్ భవనం వద్దకు భారీగా చేరుకున్న మాలలు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం భారీ బైక్ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పెద్ద ఎత్తున తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో మెమొరాండం ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకతాయిల వేధింపులపై ఫిర్యాదు చేయండి

ఆలమూరు: ఆకతాయిల వేధింపులకు పాల్పడితే సత్వరమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ కోరారు. మండలంలోని చెముడులంక కాలనీ షిర్డీసాయి విద్యానికేతన్‌లో డైరెక్టర్ టి.ఉమారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐ విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినులకు నేటి సమకాలీన పరిస్థితులపై అవగాహన కల్పించారు. విద్యార్థినులందరూ చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను సభాముఖంగా అడిగి తెలుసుకున్నారు.

జానకిరామయ్య విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన జానకిరామయ్య విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అశోక్

ఆలమూరు: మండలంలోని నర్సిపూడి తూర్పు వీధి రామాలయం వద్ద నున్న ఉండమట్ల జానకిరామయ్య విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాలభక్త సమాజం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన కళాకారుడిగా ప్రఖ్యాతి గాంచిన జానకిరామయ్య విగ్రహాన్ని 2016 మార్చి 30 ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆ విగ్రహం చుట్టూ గోనె సంచులు, టైర్లు వేసి గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ సంఘటన స్థలానికి పరిస్థితిని సమీక్షించారు. సంఘటన పూర్వాపరాలను స్థానికులను అడిగి తెలుసుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. విగ్రహ ధ్వంసంపై సమగ్ర విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షిస్తామని ఎస్సై అశోక్ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ దిగ్బంధంలో ప్రధాన కూడళ్లు

- నరక ప్రాయంగా ప్రయాణం
- అడ్డగోలు పార్కింగ్‌లు
- జాతీయ రహదారి బైపాస్‌పై అనుమతించని రాకపోకలు


మలికిపురం మార్కెట్ రోడ్డులో ఇరుక్కుపోయిన లారీతో జామ్ అయిన ట్రాఫిక్

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో ప్రధాన కూడళ్లు ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. మండల కేంద్రాలైన మలికిపురం, రాజోలుతో పాటు, తాటిపాక ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్య నానాటికీ తీవ్రం అవుతుంది. ప్రధానంగా సాయంత్రం నాలుగు గంటల నుంచి 7.30 గంటల వరకూ ఈ కూడళ్లలో ప్రయాణం అత్యంత నరక ప్రాయంగా మారుతుంది. సాయంత్రం వేళ విద్యాసంస్థలు వదిలే సమయం, సినిమా హాళ్లలో షోలు మొదలయ్యే సమయం, దూర ప్రాంతాలకు బస్సులు బయలు దేరే సమయం, ఉద్యోగులు ఇళ్లకు చేరే సమయం, వ్యాపారాలు జరిగే సమయం కూడా అదే కావడంతో రద్దీ అధికంగా ఉంటుంది. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు కూడా రోడ్డు పైనే పార్కింగ్ చేయడం, ఇతర వ్యాపార అవసరాల కోసం వ్యాపార సంస్థల ముందు కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్, ఎగుమతుల దిగుమతుల కొరకు భారీ వాహనాలు ఆయా వ్యాపార సంస్థల ముందే పార్కింగ్ చేయడం వల్ల ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అసలే ఇరుకు రోడ్డు దీనికి తోడు అడ్డగోలు పార్కింగ్‌ల వల్ల ఈ ఇబ్బందులు తప్పడం లేదు. సాయంత్రం మలికిపురం, తాటిపాకల నుంచి హైదరాబాద్, విశాఖపట్నం తదితర దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు సాయంకాలం బయలుదేరుతాయి. ఇవి రోడ్డు పక్కనే గంటల తరబడి నిలిచి ఉంటాయి. సాధారణ లోకల్ సర్వీసులు కూడా అడ్డగోలుగా నిలిపి వేస్తారు.

ఆటోలకు పార్కింగ్ లేదు

మరో వైపు ఆటోలకు కూడా పార్కింగ్ స్థలం లేదు. మలికిపురం సెంటర్‌లో మోరి రోడ్డులోనూ, సాయిబాబా గుడి వద్ద అనుమతి లేకుండా ఆటోలు అలానే నిలిచి ఉంటాయి. రాజోలు, తాటిపాకలలో కూడా ఇంతే. ఒకటి అర కాదు వందలాది ఆటోలు ఇలానే ఉంటాయి. అధికారులు వాటికి పార్కింగ్ చూపరు. యజమానులు రోడ్డును వదలరు. దీంతో ట్రాపిక్ ఇబ్బంది కరంగా మారింది.

రోడ్డు పైనే చిరు వ్యాపారాలు

చిరు వ్యాపారాలు కూడా రోడ్డును చేర్చే ఉంటాయి. గతంలో ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేసినా మరలా ఆయా కూడళ్లలో రోడ్డుకు చేర్చి తోపుడు బండ్లు, ఇతర వ్యాపారాలు సాగడం, వాటి కోసం కొనుగోలుదారులు వాహనాలతో నిలపడం వల్ల సాధారణ వాహనాలు రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది.

ఆసుపత్రుల వద్ద అదే తీరు

మలికిపురం, తాటిపాక, రాజోలు గ్రామాల్లో వివిధ ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. వాటికి పార్కింగ్ స్థలం లేదు. వాటి కోసం వచ్చే వినియోగదారులు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నాయి. ఇది కూడా రోడ్లపై ప్రయాణికులకు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారుతుంది.

ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తాం



“మలికిపురం, ప్రధాన కూడలితో పాటు దిండి జాతీయ రహదారిపై కూడా ట్రాపిక్ క్రమద్ధీకరిస్తాం. వ్యాపార కూడళ్లలో కూడా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు సిబ్బందిని నియమిస్తాం.”

– పీవీవీఎస్ఎన్ సురేష్, ఎస్సై, మలికిపురం

అటకెక్కిన బైపాస్ ప్రతిపాదన

ఇరుకుగా ఉన్న మలికిపురం రోడ్డుకు బైపాస్ నిర్మించాలని గత పదేళ్లుగా చేస్తున్న ప్రతిపాదనలు అటకెక్కాయి. గుడిమెళ్లంక వంతెన నుంచి వేపచెట్టు డ్రైన్ గట్టు మీదుగా మలికిపురంలో పెదతిప్ప వంతెన వరకూ బైపాస్ ప్రతిపాదన ఉంది. ఇది పూర్తయితే ట్రాఫిక్ సమస్య కొంత వరకూ తీరుతుంది. ఆ దిశగా పనులు ముందుకు సాగడం లేదు. ఇక రాజోలు, తాటిపాక జాతీయ రహదారి మళ్లింపు పనులు జరుగుతున్నా.. అవి నత్తనడకన సాగుతున్నాయి. తాటిపాక నుంచి గెద్దాడ, మీదుగా చింతలపల్లి, శివకోడు మీదుగా పనులు పూర్తయ్యాయి. అయినా వాహనాలను అనుమతించడం లేదు. దీని ద్వారా వాహనాలను అనుమతిస్తే తాటిపాక, రాజోలులో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది.

ఎన్ఎంయూ నిరసన


రావులపాలెంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రావులపాలెం: ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్, కండక్టర్‌లకు నైట్ అవుట్ డ్యూటీలకు చెల్లించవలసిన అలవెన్సులను ట్రెజరీ శాఖ నిలుపుదల చేయడాన్ని నిరసిస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రావులపాలెం డిపోలో కార్మికులు ఉదయం మొదటి షెడ్యూల్ నుంచి నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12.00 గంటలకు గేట్ మీటింగ్ ఏర్పాటు చేసి ఖజానా శాఖ అవలంబిస్తున్న విధానాలపై తమ నిరసన తెలియజేశారు. ఎన్ఎంయూఏ తలపెట్టిన ఈ నిరసన కార్యక్రమానికి యునైటెడ్ వర్కర్స్ యూనిటీ అసోసియేషన్ మద్దతు తెలిపి ఈ నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ ప్రెసిడెంట్ ఏఎస్ నారాయణ, సెక్రటరీ బి.యేసేపు, సీహెచ్ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజోలు ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. డిపో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ఎస్ బాబు ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. నాయకులు వీఎస్.రావు, కేపీఎస్ వాసు, ఏఎస్ఎన్‌మూర్తి, యు.శ్రీను, జేవీ బాబు, ఏడుకొండలు, నజీర్ పాల్గొన్నారు.

మగటపల్లి స్కూల్‌లో రికార్డుల పరిశీలన


మగటపల్లి స్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ కమలకుమారి

మామిడికుదురు: మగటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ కమలకుమారి, డీవైఈఓ సూర్యప్రకాశరావు, సీఎంఓ సుబ్రహ్మణ్యం శుక్రవారం పరిశీలించారు. తరగతి గదులను, విద్యా బోధనను, మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. అనంతరం ఎస్ఎంసీ ప్రతినిధులతో మాట్లాడారు. రెండున్నరేళ్ల నుంచి తెలుగు టీచర్ పోస్టు భర్తీ కాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎంసీ సభ్యుడు విప్పర్తి సత్యమూర్తి, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. తెలుగు టీచర్ పోస్టు భర్తీ కాకపోవడం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, పోస్టును సర్దుబాటు చేయమని అడుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ చేసిన ఫిర్యాదుపై కూడా పరిశీలన చేశారు. వీరి వెంట మలికిపురం ఎంఈఓ విజయశ్రీ, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్ఎం హనుమంతరావు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

అంబాజీపేట: మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ పరీక్ష నిర్వహణను ఎంఈఓ–2 మోకా ప్రకాష్ శుక్రవారం తనిఖీ చేశారు. పుల్లేటికుర్రు శివారు చీకట్లవారిపేటలో ప్రాథమిక పాఠశాలలో సెల్ఫ్ పరీక్షను పరిశీలించి విద్యార్థులను సబ్జెక్టులపై ఆరా తీశారు. అంతకుముందు హాజరు శాతాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం రుచిగా ఉండేలా వండాలని మిడ్డే మీల్స్ నిర్వాహకులకు సూచించారు. అందరూ పాఠశాలలో భోజనం చేసేలా చూడాలన్నారు.

బాలుడి వైద్యానికి రూ.30 వేల సాయం


వానపల్లిలో బాలుడి తండ్రికి నగదు అందజేస్తున్న సంఘ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు

కొత్తపేట: మండలంలోని వానపల్లికి చెందిన నాలుగేళ్ల బాలుడి వైద్యానికి మండల శెట్టిబలిజ యువజన సంఘం రూ.30 వేల సాయం అందజేసింది. గుత్తుల ప్రకాష్ అనే పేద వ్యక్తి కుమారుడు, నాలుగేళ్ల సాత్విక్ అక్యూట్ మైలోయిడ్ లుకేమియా (ఏఎంఎల్) అనే వ్యాధితో బాధపడుతున్నాడు. ఆ బాలుడిని విశాఖలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చూపించగా నివారణకు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ సర్జరీ అవసరమని వైద్యులు తెలిపారు. ఈ ట్రీట్మెంట్‌కు సుమారు రూ.50 లక్షల వరకూ ఖర్చవుతుందని, ఆ సర్జరీ వీలైనంత త్వరగా చేయాలని డాక్టర్లు స్పష్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కొత్తపేట మండల యువజన శెట్టిబలిజ సంఘం సభ్యులు బాలుడి వైద్య చికిత్స కోసం రూ 30 వేల సాయం అందించారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి బాలుడి వైద్య చికిత్స కోసం సహాయం అందించాలని శెట్టిబలిజ సంఘ సభ్యులు కోరారు. సహాయం చేసే వారు ఈ ఫోన్ పే నంబర్ 9948832106 కు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, సంఘ గౌరవాధ్యక్షుడు యనమదల శ్రీనివాస్, సెక్రటరీ శీలం కొండబాబు, ఖండ్రిగ ఉప సర్పంచ్ కడలి పార్థ సారథి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముషిణి వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ కడలి భీమా, కోశాధికారి మామిడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

కొత్తపేటలో యూటీఎఫ్ ధర్నా


కొత్తపేటలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, సభ్యులు

కొత్తపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ 2004 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వోద్యోగులకు, 2004 సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు న్యూ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమలు చేస్తున్నాయన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల హక్కు అని భిక్ష కాదన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఖాతరు చేయకుండా సీపీఎస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎస్ జ్యోతిబసు, వై.మురళి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు టి. విజయకృష్ణ, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేపీసీహెచ్ సూర్యారావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ట్యాంక్, హైజంప్ పోల్స్ వితరణ


జీవీ పుంత జెడ్పీ ఉన్నత పాఠశాలకు హై జంప్ పోల్స్ వితరణ చేసిన వారితో స్టాఫ్

సఖినేటిపల్లి: మండలంలోని జీవీ పుంత జెడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం స్థానిక భారతరత్న యూత్, లక్ష్మీనరసింహ అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం శుక్రవారం చేయూత నిచ్చింది. ఈ మేరకు విద్యార్థులకు వాటర్ ట్యాంకును భారతరత్న యూత్ అందజేసింది. అలాగే విద్యార్థులకు క్రీడా సామగ్రి నిమిత్తం అంతర్వేది దేవస్థానానికి చెందిన లక్ష్మీ నరసింహ అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం హై జంప్ పోల్స్ వితరణ చేసింది. వీటిని పాఠశాలలో హెచ్ఎం డి.ప్రసాద్‌కు అందజేశారు. భారతరత్న యూత్ అధ్యక్షుడు చొప్పల నాగేశ్వరరావును, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పోతాబత్తుల నరసింహస్వామి, సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బర్రే ముత్యాలరాజులను సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు అభినందించారు.

డిగ్రీ కళాశాల సమస్యలపై ఎంపీకి వినతి


ఎంపీ హరీష్‌కు కళాశాల సమస్యలు వివరిస్తున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలపై అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌కు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు వినతిపత్రాన్ని అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమాతో పాటు పలువురు నాయకులు కళాశాల సమస్యలను ఎంపీకి వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు, కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలు తదితర అంశాలను ప్రిన్సిపాల్ సాయిబాబు తెలియజేశారు. కళాశాల ఆటస్థలం, భవనాల పరిస్థితి వివరించి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని కోరారు.

రేపు సీపీఎస్ ఉద్యోగుల బ్లాక్ డే


బండారు నారాయణ

కొత్తపేట: యునిఫైడ్ పింఛన్ స్కీమ్ (యూపీఎస్) అమలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో సెప్టెంబర్ 1 న సీపీఎస్ ఉద్యోగుల బ్లాక్ డే నిర్వహిస్తున్నట్టు ఆ ఉద్యోగుల జిల్లా సంఘం కన్వీనర్ బండారు నారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పింఛన్ స్కీమ్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తుండగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ తీసుకువస్తుందన్నారు. ఈ విధానానికి నిరసనగా, సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో పి.గన్నవరంలో ఒకటిన ఉదయం 10 గంటలకు భారీ స్థాయిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పలు చోట్ల భారీ వర్షం

పి.గన్నవరం: మండలంలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జన జీవనం స్తంభించింది. జనం ఇళ్లకు పరిమితమయ్యారు. వర్షంతో ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పల్లపు ప్రాంతాల్లోని రోడ్లు జలమయమయ్యాయి. అధ్వానంగా మారిన పి.గన్నవరం–అంబాజీపేట రోడ్డులో వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని శుక్రవారం ఎడతెరపి లేకుండా కురుస్తుంది. వర్షంతో వ్యాపారాలు మందకొడిగా జరిగాయి. చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. రోజు వారి కూలిపనులు చేసుకునేవారు జీవనోపాధి లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అలాగే బ్యాంకులు, వివిధ వ్యాపార కార్యాలయాలు, ఆలయాలు జన సందోహం లేక పోవడంతో ఖాళీగా దర్శనమిచ్చారు. కుండపోత వర్షంతో మండలంలోని పలు రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాలనీలు ముంపుబారిన పడ్డాయి. వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

సంపూర్ణ పారిశుధ్యంతోనే వ్యాధుల నిర్మూలన

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా సీజనల్ వ్యాధులను నిర్మూలించవచ్చునని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్ణలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో సంపూర్ణ పారిశుధ్య చర్యలపై అవగాహన కల్పించారు.

కొత్తపేట డిగ్రీ కళాశాలలో దీక్షారంబ్

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫస్టియర్ విద్యార్థులకు శుక్రవారం ‘దీక్షారంబ్’ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య ఆవశ్యకత, ఉపాధి అవకాశాలు, వృత్తి నైపుణ్యాల వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటుగా కళాశాలలోని లైబ్రరీ, రీడింగ్ రూమ్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, జేకేసీ, కెరీర్ గైడెన్స్, ఐసీటీ, బెస్ట్ లెర్నింగ్ తదితర సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ డీసీహెచ్ పాపారావు, డాక్టర్ కె.అంకమరావు, సీహెచ్ నాగరాణి, వి నాగదీపిక తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ సదస్సులు

సఖినేటిపల్లి: మండలంలో చెంచు కులస్తులు నివసిస్తున్న ఏరియాల్లో శుక్రవారం అధికారులు ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ సదస్సులు నిర్వహించారు. టేకిశెట్టిపాలెంలో సర్పంచ్ పోతు దేవీదుర్గ అధ్యక్షతన గిరిజన సంక్షేమం దిశగా 11 ప్రాథమిక సౌకర్యాలు కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్ కటికిరెడ్డి మహేష్, గిడుగు సుబ్బారావు, పోతు తాతయ్య నాయుడు, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, డీటీ సీహెచ్.భాస్కర్, ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్, చెంచునాయకుడు పిట్టా ఏడు కొండలు, చెంచులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నూతన విగ్రహావిష్కరణ


గొంది న్యూ క్రాంతినగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన గొల్లపల్లి

సఖినేటిపల్లి: మండలంలోని గొంది న్యూ క్రాంతినగర్‌లో శుక్రవారం రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ రాజోలు ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి సూర్యారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన జాతికి అంకితం చేశారు. న్యూ క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, సర్పంచ్ కొండా జాన్‌బాబు, నాయకులు సరెళ్ల విజయ్ ప్రసాద్, నల్లి డేవిడ్, చొప్పల చిట్టిబాబు, నల్లి శుభాష్, తాడి సహదేవ్, నల్లి సుధీర్ పాల్గొన్నారు.

లారీ బోల్తా: తప్పిన పెను ప్రమాదం


తాటిపాకలో కడలి రోడ్డులో బోల్తా పడిన లారీని తొలగిస్తున్న దృశ్యం

రాజోలు: అధిక లోడుతో కడలి నుంచి తాటిపాక వైపు వస్తున్న ఊక లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. శుక్రవారం తాటిపాక సెంటర్‌లోని కడలిలో రోడ్డులో జరిగిన ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఊక లోడుతో కడలి నుంచి తాటిపాక సెంటర్‌కు వస్తున్న లారీ రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను తప్పించబోయి లారీ బోల్తా కొట్టిందని స్థానికులు తెలిపారు. వర్షం కురుస్తుండడంతో లారీ బోల్తా పడిన ప్రదేశంలో జనసంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. తిరగబడిన లారీని భారీ క్రేన్ సాయంతో తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు.

ప్రేమ పేరుతో వంచించిన వ్యక్తిపై కేసు

సఖినేటిపల్లి: ప్రేమ పేరుతో ఓ యువతిని నమ్మక ద్రోహం చేసిన యువకుడిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం, అంతర్వేదికర గ్రామానికి చెందిన యువతిని, అదే గ్రామానికి చెందిన బెల్లంకొండ సాయిభాస్కర్ నమ్మకం ద్రోహం చేశాడు. ఈ క్రమంలో భాస్కర్‌తో పాటు అతడి తల్లి తండ్రులుపైన సదరు యువతి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

మండలంలోని అప్పనరామునిలంకలో పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి నగదు రూ.13,550 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై దుర్గా శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు.

అప్పులబాధతో జేఎల్ ఆత్మహత్య

మామిడికుదురు: అప్పుల బాధ భరించలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన జూనియర్ లాయర్(జేఎల్) చికిత్స పొందుతూ మృతి చెందాడని నగరం ఎస్సై చైతన్యకుమార్ శుక్రవారం తెలిపారు. అప్పనపల్లి గ్రామానికి చెందిన జూనియర్ లాయర్ మేడేపల్లి సురేష్ (30) గురువారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. అతనే స్వయంగా అంబులెన్స్‌కు ఫోన్ చేసి, తాను గడ్డి మందు తాగానని చెప్పాడన్నారు. అతడ్ని కుటుంబ సభ్యులు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడన్నారు. దీనిపై మృతుని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడికి మూడేళ్ల క్రితం భవాని అనే యువతితో వివాహం జరిగిందని తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

మలికిపురం: బాల్య వివాహాల వల్ల కలిగే సమస్యలపై విశ్వేశ్వరాయపురం జెడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి లక్కవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పావని, జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా మాట్లాడారు. కిశోర బాలికలు బలమైన ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భావన, పెయ్యల చిట్టిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతామణి, ఏఎస్ఎం ఇందిరా, సీహెచ్ఓ మమత జ్యోతి, పీఈటీ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.